సాక్షి జనగామ

బుధవారం | 11 | జనవరి | 2023



కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పార్క్

త్వరలో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా జనగామ జిల్లా కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పా ర్క్‌కు శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి ఎర్రబెల్లి మంగళవారం తెలిపారు. - 8లో▸



కమనీయం.. వీరభద్రుడి కల్యాణం

కొత్తకొండ వీరభద్రస్వామి కల్యాణం కనుల పండువగా సాగింది. కల్యాణ వేడుకలను తిలకించేందుకు వందలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
31°/14°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం పొగమంచుతో చలి ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండ ఉన్నప్పటికీ, సాయంత్రం మళ్లీ చలి తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లా ఆస్పత్రిలో సదరం క్యాంపు



జనగామ: జిల్లా ఆస్పత్రిలో మంగళవారం ఆర్థో విభాగంలో సదరం క్యాంపు నిర్వహించారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు ఆధ్వర్యంలో డాక్టర్ ప్రదీప్ సదరం క్యాంపునకు వచ్చిన 50 మందికి పరీక్షలు చేశారు. ఇందులో అర్హులైనవారికి సదరం సర్టిఫికెట్లు అందించారు. పింఛన్ విభాగం డీపీఎం వినీత తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి పరిశీలన

జిల్లా ప్రభుత్వ మెడికల్ కళాశాల, జనరల్ హాస్పిటల్(జిల్లా ఆస్పత్రి)ని కాయకల్ప బృందం మంగళవారం పరిశీలించింది. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్ రాజు టీంకు స్వాగతం పలికారు. కాయకల్ప టీం డాక్టర్ వెంకటేశ్వర్లు (ఎంఎస్), క్వాలిటీ మేనేజర్ ఉపేందర్, సిస్టర్లు సఫియా (ఐసీఎన్), లావణ్య(ఐసీఎన్), అడ్మిన్ వినయ్ కిషోర్ ఆధ్వర్యంలో ఆస్పత్రిలో శుభ్రత, పరిశుభ్రతపై ఆరా తీశారు.

యువజనోత్సవాలకు అనిల్ ఎంపిక



స్టేషన్‌ఘన్‌పూర్: కేంద్ర ప్రభుత్వ యువజన క్రీడలు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కర్ణాటక రాష్ట్రంలో ఈనెల 12 నుంచి 16వరకు జరుగనున్న జాతీయ యువజనోత్సవాలకు మండలంలోని శివునిపల్లికి చెందిన పీజీ విద్యార్థి పిట్టల అనిల్‌ముదిరాజ్ ఎంపికయ్యాడు. ఈ మేరకు ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. కర్ణాటకలోని హుబ్లీ, ధర్వాట్ పట్టణాల్లో ఈనెల 12 నుంచి జరుగనున్న 26వ జాతీయ యువజనోత్సవాలకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి తనతో పాటు మరో 24 మందిని నెహ్రూ యువకేంద్ర అధికారి అన్వేష్ డివాలా ఎంపిక చేశారని తెలిపారు. ఇదిలా ఉండగా.. యువజనోత్సవాలకు ఎంపికైన అనిల్‌ను శివునిపల్లి మత్స్య సహకార సంఘం చైర్మన్ బూర్ల శంకర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్, బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ లకావత్ చిరంజీవి, గోరంటల యాదగిరి తదితరులు అభినందించారు.

పోర్ట్ ఫోలియో జడ్జిల నియామకం

వరంగల్ లీగల్: రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలకు పోర్ట్‌ఫోలియో జడ్జిలను నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాలకు జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిని, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి జిల్లాలకు జస్టిస్ ఎం.తుకారాంజీని పోర్ట్‌ఫోలియో జడ్జిలుగా నియమించారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గ్రామీణ క్రీడలకు పూర్వవైభవం తేవాలి



జనగామ : గ్రామీణ క్రీడలకు యువత పూర్వవైభవం తేవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్టన్ ఆవరణలో జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు శానబోయిన మహిపాల్ ఆధ్వర్యంలో తలపెట్టిన జిల్లా స్థాయి కబడ్డీ క్రీడోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహపూరిత పోటీతత్వం, మానసిక ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని కలిగిస్తుందన్నారు. ఈ క్రీడోత్సవాల్లో ఆయా మండలాలకు చెందిన 46 జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉడుగుల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాజ్ యాదవ్, నియోజకవర్గం కన్వీనర్ బిల్లు శ్రీను, బిజెపి పట్టణ అధ్యక్షుడు పవన్ శర్మ, రాం కోటి, కోట వినోద్ కుమార్, నవీన్ శరత్, క్రాంతి, పీఈటీలు కిషన్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’లో అక్రమాలకు చెక్

- జాబ్‌కార్డుతో ఆధార్ లింక్ తప్పనిసరి
- అనుసంధానమైతేనే నగదు చెల్లింపు
- 20వ తేదీ వరకు అవకాశం

జనగామ: జాతీయ ఉపాధి హామీ పథకంలో మరింత పారదర్శకత తీసుకురావడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. ఇప్పటి వరకు వేలిముద్రతో కూలీల వేతనాలు చెల్లించగా.. ఇక నుంచి జాబ్ కార్డును ఆధార్‌తో అనుసంధానం చేసి.. కూలీల డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. దీంతో డబుల్ జాబ్ కార్డులను ఏరివేయడంతో పాటు పనుల్లో అక్రమాలకు పూర్తిగా చెక్ పడనుంది.

2,83,183 మంది కూలీలు

జిల్లాలో ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. పంచాయతీ కార్యదర్శులతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్ల సహాయంతో ఎంపీడీఓ కార్యాలయాల్లో ఆపరేటర్లు జాబ్ కార్డులకు ఆధార్ లింక్ చేస్తున్నారు. మొత్తం 1,30,233 జాబ్ కార్డులు ఉండగా.. ఇందులో 88,643 కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. వీటిలో 2,83,183 మంది కూలీలకు 1,59,352 మంది పనులు చేస్తున్నారు. ఇప్పటి వరకు 2,09,424 జాబ్ కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేశారు. ఇందులో 50,066 కార్డులు ఎన్‌ఐసీ సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ అయ్యాయి. ఇంకా 73,759 కార్డులు ఆధార్‌తో లింక్ చేయాల్సి ఉంది. ఈ నెల 20వ తేదీ వరకు అవకాశం ఇచ్చారు.

సాంకేతిక సమస్యలతో ఇబ్బంది..

కూలీల హాజరు నమోదు చేయడానికి ఫీల్డ్ అసిస్టెంట్లకు తంటాలు తప్పడం లేదు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సాఫ్ట్‌వేర్(ఎన్‌ఎంఎంఎస్) యాప్ ద్వారా కూలీల వివరాలు రోజూ పని ప్రదేశంలో జీపీఎస్ ఆధారంగా నమోదు చేయాల్సి ఉంటుంది. మొదట ఉదయం ఫొటోలను అప్‌లోడ్ చేసిన తర్వాత నాలుగు గంటల తర్వాత మరో మారు ఫొటోలు, పని వివరాలను అప్‌లోడ్ చేయాల్సి ఉండగా గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్య, సర్వర్ డౌన్‌గా ఉండటంతో ఈ ప్రక్రియ సజావుగా సాగటం లేదు. ఆధార్ అనుసంధానంలోనూ అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు ఎఫ్‌ఏలు చెబుతున్నారు. ఆధార్‌కార్డులో ఓ రకంగా, జాబ్ కార్డులో మరో రకంగా పేర్లు, స్పెల్లింగులు, చిరునామాలు ఉండటంతో లింకప్ కావడం లేదని తెలుస్తోంది.



నర్సరీలో కూలీలు పనులు చేస్తుండగా పరిశీలిస్తున్న అధికారులు

జిల్లాలో ఉపాధి హామీ వివరాలు	
జాబ్‌కార్డులు	1,30,233
యాక్టివ్ కార్డులు	88,643
కూలీల సంఖ్య	2,83,183
యాక్టివ్ కూలీలు	1,59,352
ప్రతి నెలా చెల్లింపులు	రూ.153.54కోట్లు

జాబ్‌కార్డులు ఆధార్‌తో లింక్ చేస్తున్నాం..



ఉపాధి హామీ జాబ్ కార్డులను ఆధార్‌తో లింక్ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటి వరకు 2,09,424 కార్డులకు అనుసంధానం పూర్తయింది. మరో 73,759 కార్డులు లింక్ చేయాల్సి ఉంది. ఈనెల 20వ తేదీ వరకు అవకాశం ఇచ్చాం.

- గూడూరు రాంరెడ్డి, డీఆర్డీఓ

ఏం చేశారని ప్రధాని మోదీ పర్యటన

- ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణకు ఏమి ఒరగబెట్టారని ఈనెల 19న ప్రధాని రాష్ట్ర పర్యటనకు వస్తున్నారని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి ప్రశ్నించారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 54 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను డివిజన్ కేంద్రంలో మంగళవారం పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు చింతకుంట్ల నరేందర్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన కడియం చెక్కులను పంపిణీ చేసి, మాట్లాడారు. పేద కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ వరం లాంటిదని, పేదలకు మెరుగైన వైద్యం కోసం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఎనిమిదేళ్ల సీఎం కేసీఆర్ సమర్థవంతమైన పాలనతో తెలంగాణ రాష్ట్రం దేశానికే దిక్సూచిగా మారిందన్నారు. కాంగ్రెస్, బీజేపీలు పాలిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారా అని ప్రశ్నించారు. రాజకీయ దురుద్దేశ్యంతో తెలంగాణపై విషం కక్కడం కాదని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూడాలన్నారు. తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోతుంటే బీజేపీ కుట్రతో అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తుందని ఆరోపించారు. 19న తెలంగాణకు వస్తున్న ప్రధాని మోదీ తెలంగాణకు ఒక్క జాతీయ ప్రాజెక్టు అయినా ఇచ్చారా, ఒక్క విశ్వవిద్యాలయమైనా నెలకొల్పారా అంటూ ప్రశ్నించారు. బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం, రాష్ట్ర విభజన చట్టం తదితర హామీలను విస్మరించారన్నారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్ల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు సీహెచ్.నరేందర్‌రెడ్డి, బూర్ల శంకర్, సారంగపాణి, రాపోలు మధుసూదన్‌రెడ్డి, రాంబాబు, గట్టయ్య, రజాక్‌యాదవ్, రాములు, కరుణాకర్, లింగారెడ్డి, సమ్మయ్య, దశరథ్‌నాయక్, నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

నాగారం రైతులకు న్యాయం చేయండి

జనగామ: లింగాలఘనపురం మండలం నాగారం రైతులకు రైతుబంధు పెట్టుబడి సాయంలో జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి, న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి మంగళవారం బాధిత రైతులతో కలిసి కలెక్టర్ శివలింగయ్యను కలిశారు. పెట్టుబడి సాయంతో పాటు పంట రుణం సైతం రెన్యువల్ కావడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం రైతులతో కలిసి వినతి పత్రం అందించారు. ఈమేరకు ఆర్డీఓ మధుమోహన్, జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్‌ను పిలిపించిన కలెక్టర్ ఈ విషయమై ఆరా తీశారు.

పలువురు రైతులు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అందించిన పట్టాదార్ పుస్తకం ఉన్నప్పటికీ, రైతుబంధు పెట్టుబడి సాయంతో పాటు పంట రుణాలు రెన్యువల్ చేయడం లేదన్నారు. గత వానాకాలం సీజన్ వరకు పెట్టుబడి సాయం అందించి, యాసంగిలో నిలిపి వేశారన్నారు, దీనిపై డీఏఓ వద్దకు వెళ్లగా, భూములు ప్రొహిబిటెడ్‌లో ఉండడంతోనే ఈ సమస్య వచ్చిందని తెలిపినట్లు చెప్పారు. చట్టబద్ధంగా తామంతా న్యాయంగా ఉండి భూములను సాగు చేసుకుంటున్నామని, వెంటనే పొహిబిటెడ్ నుంచి తొలగించి పెట్టుబడి సాయం, పంట రుణం రెన్యువల్ అయ్యేలా చూడాలని విన్నవించారు.

ఎంసీహెచ్‌లో సరికొత్త రికార్డు



24 గంటల్లో జన్మించిన శిశువులు వారి కుటుంబ సభ్యులతో వైద్య బృందం



ఎంసీహెచ్ బృందానికి ట్విట్టర్‌లో మంత్రి హరీశ్‌రావు అభినందన

- 24 గంటల్లో 35 డెలివరీలు
- ట్విట్టర్‌లో మంత్రి హరీశ్‌రావు అభినందన

జనగామ: జనగామ చంపక్‌హిల్స్ మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్) సరికొత్త రికార్డు నెలకొలిపింది. రాష్ట్రంలోని చిన్న జిల్లాల పరిధి ఎంసీహెచ్‌ల్లో నంబర్‌వన్ స్థానంలో నిలిచింది. 24 గంటల వ్యవధిలో 35 డెలివరీలు చేసి, మరోసారి తమ సత్తాను చాటుకున్నారు వైద్యులు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్ రాజు పర్యవేక్షణలో డాక్టర్ శోభ, డాక్టర్ రజని, డాక్టర్ మనస్విని, సిస్టర్లు మరియమ్మ, సంగీత, ఇతర వైద్య బృందం ఆధ్వర్యంలో అలుపెరగని సేవలు అందించారు. మొదటి కాన్పులో 9 నార్మల్, 4 ఆపరేషన్లు, రెండు, మూడో కాన్పు చేసుకున్న వారు 22 మందికి ఆపరేషన్లు చేసి, పురుడు పోశారు. జనగామ ఎంసీహెచ్ చరిత్రలో 24 గంటల వ్యవధిలో 35 ప్రసూతి కాన్పులు చేయగా, దాదాపు రాష్ట్రంలో నంబర్ వన్‌గా చెబుతున్నారు. రికార్డు డెలివరీలు చేసిన డాక్టర్లు, వైద్య బృందాన్ని డాక్టర్ శంకర్‌తో కలిసి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు సత్కరించారు.

ట్విట్టర్‌లో మంత్రి కితాబు

జనగామ ఎంసీహెచ్‌లో 24 గంటల వ్యవధిలో 35 ప్రసూతి కాన్పులు చేసిన వైద్యులు, వైద్య బృందాన్ని వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అభినందించారు. ట్విట్టర్ వేదికగా ఫొటోను ట్యాగ్ చేస్తూ కొనియాడారు.

ఫలిస్తున్న 12 ఏళ్ల కల!

కాజీపేట రైల్వే వ్యాగన్ యూనిట్‌కు మోక్షం

- 19న ప్రధాని మోదీ రిమోట్‌తో భూమిపూజ
- అయోధ్యపురంలో 155 ఎకరాల్లో రూ.521 కోట్లతో నిర్మాణం

కాజీపేట రూరల్: కాజీపేటకు కేటాయించిన రైల్వే వ్యాగన్ పిరియాడికల్ ఓవరాలింగ్ వర్క్‌షాప్ ప్రాజెక్ట్ నిర్మాణం కల 12 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తరువాత నెరవేరబోతోంది. జనవరి 19వ తేదీన హైదరాబాద్‌కు రానున్న ప్రధాని మోదీ.. ఈ ప్రాజెక్ట్‌కు రిమోట్ ద్వారా భూమిపూజ చేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ మేరకు భూమి పూజ ఏర్పాట్లలో సికింద్రాబాద్, కాజీపేట రైల్వే అధికారులు నిమగ్నమయ్యారు. కాజీపేట వ్యాగన్ మంజూరు తర్వాత మంజూరైన కర్ణాటకలోని యాద్గిరిలో లాఫ్ ఆఫ్ బుష్ యూనిట్, రాయ్‌బరేలిలో కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయి ఉత్పత్తి కూడా జరుగుతోంది.

పుష్కర కాలం తరువాత..

2009–2010 రైల్వే బడ్జెట్‌లో నాటి రైల్వేమంత్రి మమత బెనర్జీ సికింద్రాబాద్ డివిజన్‌కు రూ.200 కోట్ల వ్యయంతో వ్యాగన్‌ల తయారీ పరిశ్రమను పీపీపీ విధానంలో మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సికింద్రాబాద్ డివిజన్‌కు కేటాయించిన వ్యాగన్‌ను కాజీపేటలో నిర్మాణం చేపట్టేందుకు రైల్వే అధికారులు నిర్ణయించారు. దీంతో జంక్షన్ సమీప గ్రామాలైన అయోధ్యపురం, కుమ్మరిగూడెం, కడిపికొండ, మడికొండ గ్రామాల శివారు పరిధిలో భూమి సర్వే చేపట్టారు. తెలంగాణ రాష్ట్రం నేపథ్యంలో కొంతకాలం బ్రేక్ పడింది. తర్వాత 2016–2017 రైల్వే బడ్జెట్‌లో నాటి రైల్వే మంత్రి సదానంద గౌడ కాజీపేట వ్యాగన్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్ స్థానంలో వ్యాగన్ పిరియాడికల్ ఓవరాలింగ్ వర్క్‌షాప్‌ను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో వ్యాగన్ వర్క్‌షాప్ సర్వే పనులు ప్రారంభమయ్యాయి. దశల వారీగా ఎన్నో ఉద్యమాలు, పోరాటాల ఫలితంగా ఇటు జిల్లా అధికారులు, ఇటు రాజకీయపార్టీల ఒత్తిళ్లతో ఎట్టకేలకు వ్యాగన్ వర్క్‌షాప్ నిర్మాణానికి లైన్ క్లియర్ అయింది. దీంతో అయోధ్యపురంలో 155 ఎకరాల విస్తీర్ణంలో రూ.521 కోట్ల వ్యయంతో అతిపెద్ద రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ ప్రాజెక్ట్ నిర్మాణానికి ప్రధాని నరేంద్రమోదీ రిమోట్ ద్వారా భూమిపూజ, శంకుస్థాపన చేయనున్నారు.

1984నుంచి ఉద్యమాలు

కాజీపేటకు రైల్వే పరిశ్రమలు రావాలని, ఇక్కడి నిరుద్యోగం తీరాలని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, జిల్లా ప్రజలు ఉద్యమాలు చేశారు. 1984లో కాజీపేటకు మంజూరైన రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ వచ్చినట్టే వచ్చి పంజాబ్‌లోని కపుర్తాలకు తరలిపోయింది. అప్పటినుంచి నేటి వ్యాగన్ వరకు కాజీపేట ఎలాంటి రైల్వే పరిశ్రమకు నోచుకోలేదు. దాదాపు 39 ఏళ్ల తర్వాత కాజీపేటలో రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్‌నకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది.



అయోధ్యపురం వద్ద రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ నిర్మాణం చేపట్టనున్న భూమి ఇదే

ప్రాజెక్టు వల్ల లాభాలు

- ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రతి 18 నెలలకు ఒకసారి రైల్వేవ్యాగన్ వచ్చి మెయింటనెన్స్ చెక్ చేసుకుంటుంది.
- కాజీపేట పరిసర ప్రాంతాల్లో చిన్న చిన్న పరిశ్రమలు నెలకొల్పుతారు.
- సుమారు ఆర్‌ఆర్‌బీ ద్వారా 5వేల మందికి ఉపాధి కలుగుతుంది.
- పరోక్షంగా సుమారు 5వేల మందికి ఉపాధి దొరుకుతుంది.

ఇక కాజీపేట డివిజన్, కోచ్ ఫ్యాక్టరే

వ్యాగన్ వర్క్‌షాప్ తర్వాత కాజీపేట రైల్వే డివిజన్ కేంద్రం, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి రాజకీయ పార్టీలకతీతంగా పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని జిల్లా ప్రజలు అంటున్నారు. ఒక రైల్వే డివిజన్ కేంద్రానికి ఉండాల్సిన అన్ని అర్హతలు ఉన్న కాజీపేటకు ఉన్నాయని, అదేవిధంగా కాజీ పేటకు కేటాయించి.. తరలిన కోచ్‌ఫ్యాక్టరీ తిరిగి మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

వరంగల్ మీదుగా వందేభారత్ రైలు

19వ తేదీన ప్రధాని నరేంద్రమోదీ సికింద్రాబాద్–విశాఖపట్నానికి వరంగల్ మీదుగా వందేభారత్ రైలును ప్రారంభించనున్నట్లు మంగళవారం రైల్వే అధికారులు తెలిపారు. కాజీపేట, వరంగల్ మీదుగా తొలి వందేభారత్ రైలు ప్రధాని ప్రారంభంతో జిల్లా ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ వందేభారత్ రైలుకు వరంగల్, ఖమ్మం, విజయవాడ, రాజమండ్రిలో హాల్టింగ్‌ను కల్పించారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

చిల్పూరు: కార్పొరేట్ పాఠశాలలు దీటుగా తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయని జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాజవరం పంచాయతీ పరిధిలో ఉన్న కస్తూర్బా పాఠశాలలో జెడ్పీ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ కృష్ణారెడ్డిలు మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎస్‌ఓ ప్రశాంతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సంపత్ రెడ్డి మాట్లాడారు. ఇటీవల పాఠశాలను సందర్శించగా విద్యార్థులు పలు సమస్యలను తెలిపారని అందులో మొదటి సమస్యను పరిష్కరించినట్లు చెప్పారు. త్వరలో మంత్రి దయాకర్ రావు చేతుల మీదుగా ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభిస్తామన్నారు. పాఠశాలలో మినీ గ్రంథాలయ ఏర్పాటుకు కృషిచేస్తానని గ్రంథాలయ చైర్మన్ అన్నారు. సమావేశంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు లింగారెడ్డి, సర్పంచ్‌లు లక్ష్మితాగూర్, రాజ్‌కుమార్, రూప్లానాయక్, ఎంపీటీసీ ఉమ, యాదగిరి, రమేష్‌నాయక్, దామోదర్, వెంకటస్వామి ఉన్నారు.



హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్

హోరాహోరీగా క్రికెట్ మ్యాచ్

- తలపడిన పోలీసు, ప్రెస్, కౌన్సిలర్లు
- రెండు మ్యాచ్‌లలో విజేతలుగా ఖాకీలు..
- డీసీపీకి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్

జనగామ: సంక్రాంతి పండగను పురస్కరించుకుని జనగామ ప్రెస్టన్ మైదానంలో మంగళవారం నిర్వహించిన 20–20 క్రికెట్ మ్యాచ్ రసవత్తరంగా సాగింది. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్‌రెడ్డి నిర్వహించిన క్రికెట్ పోటీలో జనగామ పోలీసులు, జర్నలిస్టులు, మున్సిపల్ కౌన్సిలర్లు తలపడ్డారు. మ్యాచ్ చివరి వరకు ఉత్కంఠ భరితంగా సాగింది. మొదటగా పోలీసు, జర్నలిస్టుల మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న జర్నలిస్టుల టీం 10 వికెట్లను కోల్పోయి 67 పరుగులు చేసింది. ఇందులో బండి శ్రీనివాస్‌రెడ్డి 14, సంతోష్ 14, పరుగులు చేయగా, కుమార్ 2 వికెట్లు సాధించారు. ఆ తర్వాత బరిలో దిగిన పోలీసులు తమదైన శైలిలో ఆడారు. ఇందులో ఏసీపీ దేవేందర్‌రెడ్డి అత్యధింగా 37 పరుగులు సాధించగా, కానిస్టేబుల్ రవి 5 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. సెకెండ్ సెషన్‌లో జరిగిన పోటీల్లో పోలీసుల జట్టు 132 పరుగులు సాధించగా, డీసీపీ పి.సీతారాం 37, ఏసీపీ దేవేందర్‌రెడ్డి 40 పరుగులతో హడలెత్తించారు. కానిస్టేబుల్ రవి రెండో మ్యాచ్‌లో సైతం 5 వికెట్లు సాధించి సత్తాను చాటుకున్నాడు. కౌన్సిలర్ల టీం పరుగుల వేటలో చతికిల బడ్డారు. కౌన్సిలర్ మల్లవరపు అరవింద్ రెడ్డి ఒక్కరే 27 పరుగులు సాధించగా, మిగతా వారు రాణించలేకపోయారు. చివరకు 57 పరుగులకు ఆలౌట్ కావడంతో పోలీసులు 72 పరుగల తేడాతో గెలుపొందారు. ఇందులో తాళ్ల సురేష్‌రెడ్డి ఒక వికెట్ సాధించారు. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన డీసీపీ సీతారాంకు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించగా, 10 వికెట్లు సాధించిన కానిస్టేబుల్ రవికి బెస్ట్ బౌలర్‌గా ప్రకటించారు. 27 పరుగులు, రెండు స్టంప్ అవుట్లు చేసిన బండి శ్రీనివాస్‌రెడ్డిని బెస్ట్ కీపర్‌గా గుర్తించారు. ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐలు ఎలబోయిన శ్రీనివాస్, నాగబాబు, ఎస్సైలు శ్రీనివాస్, రఘుపతి, నవీన్, జీనత్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బ్యాటింగ్ చేస్తున్న డీసీపీ సీతారాం

క్రీడా ప్రాంగణాలను సుందరంగా తీర్చిదిద్దాలి



అధికారులతో మాట్లాడుతున్న ప్రఫుల్‌దేశాయ్

బచ్చన్నపేట: గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రతి క్రీడా ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని, ప్రాంగణాల్లో లైటింగ్ సౌకర్యం ఏర్పాటు చేసి క్రీడా పోటీలను నిర్వహించాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. మంగళవారం మండలంలోని గోపాల్‌నగర్‌లో మల్టీలేయర్ ప్లాంటేషన్‌ను, బచ్చన్నపేటలో క్రీడా ప్రాంగణంతో పాటు ఉన్నత పాఠశాలలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయిజీని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఆదర్శ పాఠశాల నుంచి ఉన్నత పాఠశాలకు వచ్చే మురుగు కాల్వల పనులను వెంటనే చేపట్టాలని, మురికి నీటిని అరికట్టలేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల కేంద్రంలో ఇంత పెద్ద విద్యాసంస్థలు ఉన్న స్థలంలో ముళ్ల కంపలు, మురుగు నీరు ప్రవహించడం ఏమిటని ప్రశ్నించారు. క్రీడా ప్రాంగణాలలో, రోడ్లకు ఇరువైపులా, పాఠశాలలో పూల మొక్కలను నాటి, నాటిన మొక్కను సంరక్షించాలని సూచించారు. బచ్చన్నపేటలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ రాంరెడ్డి, ఎంపీడీఓ రఘురామకృష్ణ, సర్పంచ్‌లు వడ్డెపల్లి మల్లారెడ్డి, పర్వతం మధుప్రసాద్, ఎంఆర్‌ఐ భగత్‌రెడ్డి, ఏపీఎం మురాహరి, ఈసీ జగదీష్, టీఏ సత్యనారాయణ, పంచాయితీ కార్యదర్శులు అనిల్‌రాజ్, కవిత పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ బాధ్యతాయుతంగా చేపట్టాలి

- కలెక్టర్ శివలింగయ్య

జనగామ : ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న 2వ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని అధికారులు బాధ్యతాయుతంగా చేపట్టి విజయవంతం చేయాలని కలెక్టర్ శివలింగయ్య ఆదేశించారు. కంటి వెలుగు అమలు తీరుపై ఆయా మండలాల అధికారులతో వీడి యో కాన్ఫరెన్స్‌లో మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. కంటి వెలు గు క్యాంపులు నిర్వహించే ప్రదేశాల్లో శిబిరాలకు వచ్చే వారికి కావాల్సిన మౌలిక వసతుల ఏర్పాట్లు చేయాలని చెప్పారు. శిబిరాల్లో నిరంతర కరెంటు సరఫరాకు చర్యలు చేపట్టాలని తెలిపారు. వైద్య సిబ్బంది సాధ్యమైనంతవరకు రాత్రి పూట స్థానికంగా బస చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కంటి వెలుగు కార్యక్రమం ఏఏ రోజు ఎక్కడ నిర్వహిస్తున్నారనే వివరాలను ముందస్తుగానే ప్రచారం చేయాలని ఆదేశించారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచుల సహాయ సహకారాలు తీసుకోవాలన్నా రు. ఆయా కూడళ్లలో శిబిర ప్రచార ఫ్లెక్సీలను ఏర్పా టు చేయాలన్నారు. కంటి పరీక్షలు ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు నిర్వహించాలని, అధికారులు సిబ్బంది సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. పర్యవేక్షణకు మండలానికో స్పెషల్ ఆఫీసర్‌ను నియమించినట్లు వెల్లడించారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, డీఎంహెచ్‌ఓ మహేందర్, ఆర్డీఓ మధుమోహన్, డీఆర్డీఓ తదితరులున్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య

పదవి భార్యది.. హాజరు భర్తది..!

తరిగొప్పుల: ప్రభుత్వ అధికారిక సమావేశాలకు మహిళా ప్రజాప్రతినిధులే హాజరు కావాలని, వారి స్థానంలో భర్తలను అనుమతించకూడదని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ అధికారిక సమావేశానికి మహిళా సర్పంచులకు బదులు వారి భర్తలు హాజరుకావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల పరిషత్ అధికారి జయరావు అధ్యక్షతన మంగళవారం కంటి వెలుగు కార్యక్రమం నిర్వహణపై ఏర్పాటు చేసిన సమావేశానికి మండలంలోని కొత్తతండా, పోతారం మహిళా సర్పంచులకు బదులుగా వారి భర్తలు హాజరయ్యారు. అంతేకాకుండా వారికి బదులుగా హాజరు రిజిష్టర్‌లో సంతకాలు కూడా చేయడం గమనార్హం.



మహిళా సర్పంచుల స్థానంలో హాజరైన వారి భర్తలు (సర్కిల్‌లో)

క్లుప్తంగా

పోక్సో కేసులో అన్నదమ్ముల అరెస్ట్?

ఖిలా వరంగల్: బాలికకు మాయమాటలు చెప్పి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడిన వరంగల్ నర్సంపేట రోడ్డులోని దయానంద్ కాలనీకి చెందిన అన్నదమ్ములు ఎండి అజ్మత్ అలీ, అక్బర్ అలీని పోక్సో కేసులో మిల్స్‌కాలనీ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిసింది. కాగా, ఈ కేసు విషయంలో మొదటి నుంచి పోలీసులు అత్యంత గోప్యత పాటిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదైన వెంటనే నిందితులను అదుపులోకి తీసుకుని పలు కోణాల్లో విచారించినట్లు సమాచారం. సోమవారం సాయంత్రం వరంగల్ మట్టెవాడలోని ఏసీపీ కార్యాలయంలో మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్‌తో కలిసి ఏసీపీ కల్కోట గిరికుమార్ కేసు వివరాలు చర్చించినట్లు తెలిసింది.

హోటళ్లు, రెస్టారెంట్లలో ఆకస్మిక తనిఖీలు

రామన్నపేట: వరంగల్ జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం(కన్జూమర్ ఫోరం) కమిటీ, ఉమ్మడి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి భారతి ఆధ్వర్యంలో సిబ్బంది వరంగల్, హనుమకొండలోని హోటళ్లు, రెస్టారెంట్లు, హోల్ సేల్ కిరాణషాపులు, బేకరీల్లో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఫ్రిజ్‌ల్లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాల శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపారు. రిపోర్టులు వచ్చిన తర్వాత హోటళ్లు, రెస్టారెంట్లపై చర్యలు తీసుకుంటామని భారతి తెలిపారు. ఆహార కల్తీ నిరోధక చట్టానికి సంబంధించిన(ఎస్ఎస్ఏఐ) లైసెన్స్ పొంది ఉండాలని, కార్మికులు శుభ్రత పాటించాలని లేదంటే రూ.2 లక్షల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కన్జుమర్ ఫోరం అధ్యక్షుడు గిరగాని సుదర్శన్‌గౌడ్, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు వసంత, రవీందర్, శ్రీనివాస్‌రావు, సేఫ్టీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురికి జైలు

వరంగల్ క్రైం : హనుమకొండ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనం నడిపిన నలుగురికి జడ్జి జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ మంగళవారం తెలిపారు. కరీంనగర్‌కు చెందిన తూర్పాటి రవి, పంతినికి చెందిన ఉప్పరి రాజు, నందనంకు చెందిన మాలోత్ భాస్కర్, మైలారం గ్రామానికి చెందిన ఓర్సు రాంబాబు మద్యం తాగి పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో కోర్టులో హాజరుపరచగా వారికి రెండు రోజుల పాటు జైలు శిక్ష పడింది. అలాగే, మరో ఐదుగురికి రూ.13,500 జరిమానా విధించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

కురవి: అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కంచర్లగూడెంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై రాము కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ధరావత్ రాంసు (70)కు భార్య సాలి, ఇద్దరు కుమారులు వీరన్న, మల్సూర్ ఉన్నారు. రాంసుకు సోమవారం రాత్రి విరేచనాలు కావడంతో మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. తన అన్న వీరన్న కొట్టడం వల్లే తండ్రి రాంసు చనిపోయాడని మల్సూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కమనీయం.. వీరభద్రుడి కల్యాణం

- స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే సతీశ్‌కుమార్
- హాజరైన జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, ఎమ్మెల్యే రాజయ్య


కల్యాణం జరిపిస్తున్న యాగ్నికులు


పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

భీమదేవరపల్లి: కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో స్వామివారి, అమ్మవారల కల్యాణం మంగళవారం కమనీయంగా సాగింది. తొలుత ఆలయంలో అర్చకులు ధ్వజారోహణం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవారలకు హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం లోక కల్యాణార్థం వీరభద్రస్వామి, భద్రకాళి అమ్మవారల ఉత్సవమూర్తులను అలంకరించి మేళతాళాల నడుమ కల్యాణ వేదిక వద్దకు తీసుకురాగా.. వేదోత్తములైన ఆగమ పండితులు, యాగ్నికులచే కల్యాణోత్సవాన్ని మంగళవారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. కాగా.. వీరభద్ర స్వామి కల్యాణ వేడుకలను తిలకించేందుకు వందలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, ఎంపీపీ జక్కుల అనిత, జెడ్పీటీసీ వంగ రవి, ఆలయ కమిటీ చైర్మన్ మాడిశెట్టి కుమారస్వామి, ఈఓ కిషన్‌రావు, సర్పంచ్ దూడల ప్రమీల, ఎంపీటీసీ యాటపోలు రాజమణి, అర్చకులు కంచనపల్లి రాజన్న, మొగిలిపాలం రాంబాబు, మాజీ చైర్మన్లు మార్పాటి మహేందర్‌రెడ్డి, పిడిశెట్టి కనకయ్య, చిట్టంపల్లి అయిలయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పార్క్

- త్వరలో కేటీఆర్ శంకుస్థాపన
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


రాపోలును సన్మానిస్తున్న మంత్రి ఎర్రబెల్లి

కొడకండ్ల: త్వరలోనే మంత్రి కేటీఆర్ చేత కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పార్క్‌కు శంకుస్థాపన చేయించి చేనేత కార్మికులకు ఉపాధి కల్పిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బీఆర్ఎస్‌లో చేరిన అనంతరం స్వగ్రామానికి వచ్చిన మాజీ ఎంపీ రాపోలు ఆనందభాస్కర్‌ను మంత్రి మంగళవారం కలిసి సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటివెలుగు కార్యక్రమం మహోన్నతమైందని, కంటివెలుగు విజయవంతానికి స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. ఈ నెల 12న సీఎం కేసీఆర్ మహబూబాబాద్‌లో కలెక్టరేట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారని, 18న ఖమ్మంలో బీఆర్ఎస్ తొలి బహిరంగ సభ నిర్వహిస్తున్నందున రెండు కార్యక్రమాలకు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ జ్యోతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సింధె రామోజీ, ఆర్ఎస్ఎస్ మండల కన్వీనర్ వెంకటేశ్వర్‌రావు, ఈజీఎస్ డైరెక్టర్ యాకయ్య, సర్పంచ్ మధుసూదన్, మహేష్‌నాయక్, విజయమ్మ, సోమరాములు, సుధీర్‌రెడ్డి, వెంకటనారాయణ, సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జున్ కుటుంబానికి అండగా ఉంటాం..

- కుటుంబ బాధ్యత పార్టీదే.. ఇంట్లో ఒకరికి ఉద్యోగం
- ఫోన్‌లో పరామర్శించిన మంత్రి కేటీఆర్


మల్లికార్జున్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రైడ్‌కో చైర్మన్ సతీష్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ జగదీష్

ములుగు రూరల్ (గోవిందరావుపేట): తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు గజ్జి మల్లికార్జున్ గుండెపోటుతో సోమవారం ఆకస్మికంగా మృతి చెందిన విషయం విధితమే. ఈ విషయం తెలుసుకున్న మంత్రి కేటీఆర్ బాధిత కుటుంబాన్ని మంగళవారం ఫోన్‌లో పరామర్శించారు. కుటుంబ బాధ్యత పార్టీదేనని, పిల్లలకు చదువుతో పాటు, ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. కాగా, మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్, రెడ్‌కో చైర్మన్ సతీష్‌రెడ్డితో కలిసి మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ తుమ్మల హరిబాబు, మండల అధ్యక్షుడు సురపనేని సాయిబాబా, ప్రధాన కార్యదర్శి లకావత్ నర్సింహనాయక్, నాయకులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

- ప్రియుడితో కలిసి భర్తను కడతేర్చిన భార్య


గొడ్డె బసవయ్య (ఫైల్)


హత్యకు గురైన బసవయ్య(బాబు) మృతదేహం వద్ద వివరాలు తెలుసుకుంటున్న సీఐ, ఎస్సై

వాజేడు: వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని.. కట్టుకున్న భర్తను ప్రియుడితో కలిసి కడతేర్చింది ఓ భార్య. ఈ ఘటన ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని పేరూరు గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పేరూరు ఎస్సై రుద్రారపు హరీష్ తెలిపిన వివరాల ప్రకారం.. పేరూరుకు చెందిన గొడ్డె బసవయ్య(బాబు)కు సుమారు 18 ఏళ్ల క్రితం సుజాతతో వివాహం జరిగింది. ముగ్గురు పిల్లలు కలిగారు. ఈ క్రమంలో సుజాత.. అదే గ్రామానికి చెందిన పెండికట్ల దర్శన్‌బాబుతో వివాహేతర సంబంధం పెట్టుకుంది. విషయం తెలిసిన బసవయ్య... భార్యను మందలించాడు. అయినా ఆమె తీరు మారక పోవడంతో గ్రామ పెద్దల సమక్షంలో ఇటీవల పంచాయితీ పెట్టి నచ్చజెప్పారు. భర్తతో బుద్ధిగా కాపురం చేసుకుంటానని చెప్పిన సుజాత.. మళ్లీ ప్రియుడి మోజులో పడి తన వివాహేతర సంబంధాన్ని కొనసాగించింది. వీరి సంబంధానికి బసవయ్య అడ్డమని భావించిన సుజాత.. ప్రియుడు దర్శన్‌బాబుతో కలిసి సోమవారం రాత్రి బసవయ్య గొంతు నులిమి చంపింది. మంగళవారం ఉదయం విషయం వెలుగుచూడడంతో వెంకటాపురం(కె) సీఐ కాగితోజు శివప్రసాద్ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడి బావమర్ది గోట లాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరీష్ తెలిపారు. ఏటూరునాగారం సివిల్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

సరికొత్త మోసం

- తక్కువ ధరకే 15 లీటర్ల ఫ్రీడం ఆయిల్ డబ్బా
- ఓపెన్ చేస్తే అంతా నీరే
- లబోదిబోమంటున్న బాధితులు



నీరు వచ్చిన ఫ్రీడం సన్ ఫ్లవర్ ఆయిల్ డబ్బాలు ఇవే..

ఖిలా వరంగల్: సంక్రాంతి పర్వదినం.. ఇంటింటా పిండి వంటలు మొదలయ్యాయి. ఇదే అదను అని భావించిన దోపిడి ముఠా సరికొత్త మోసానికి తెరలేపింది. తక్కువ ధరకే ఫ్రీడం సన్ ఫ్లవర్ ఆయిల్ డబ్బా అందజేస్తామని నమ్మించి మోసం చేసింది. ఈ సంఘటన మంగళవారం వరంగల్ రంగశాయిపేటలోని బక్కివాడ, యాదవవాడలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. బక్కివాడ, యాదవవాడలో సోమవారం ఇద్దరు వ్యక్తులు వాహనాలపై సంచరిస్తూ 15 లీటర్ల ఫ్రీడం సన్ ఫ్లవర్ ఆయిల్ డబ్బా రూ.1,500కే విక్రయిస్తున్నామని.. నేరుగా కంపెనీ నుంచి తెప్పించామని నమ్మబలికారు. దీంతో నమ్మిన స్థానికులు వారి నుంచి సన్ ఫ్లవర్ ఆయిల్ డబ్బాలు కొనుగోలు చేశారు. తీరా డబ్బా ఓపెన్ చేసి చూస్తే దానిలో నీళ్లు ఉన్నాయి. కింద నీళ్లు పోసి పైభాగాన కొద్దిగా నూనె పోసి మోసం చేశారని బాధితులు లబోదిబోమన్నారు. సమాచారం అందుకున్న మిల్స్‌కాలనీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కొత్త వ్యక్తులు, అనుమానితులు కనిపిస్తే డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు.

కేవీకేను సందర్శించిన ములుగు అదనపు కలెక్టర్


వర్మి కంపోస్ట్ తయారీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నాగపద్మజ

మామునూరు: ఖిలా వరంగల్ మండలం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రాన్ని ములుగు అదనపు కలెక్టర్ నాగపద్మజ, ఆర్‌డీఏ పీడీ వెంకటనారాయణ మంగళవారం సందర్శించారు. కేవీకే ప్రాంగణంలోని అజోల్ల యూనిట్, వర్మి కంపోస్ట్, న్యూట్రీ గార్డెన్, రాజశ్రీకోళ్ల యూనిట్, చేపల చెరువును పరిశీలించారు. ములుగు జిల్లాలో 100 రోజుల పనిచేస్తున్న లబ్ధిదారులకు ఉన్నతి పథకం కింద శిక్షణ ఇప్పించడం గురించి చర్చించారు. కేవీకే చేపట్టిన విస్తరణ కార్యక్రమాలను కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.రాజన్న వారికి వివరించారు. కార్యక్రమంలో కేవీకే అధికారులు, ములుగు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కళాకారుల సొమ్ము కాజేతపై విచారణ

- రూ.50లక్షల వరకు మాయం చేసినట్లు ప్రాథమిక అంచనా


కళాకారులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శ్రీనివాస్, ఇతర అధికారులు

హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖలో పనిచేసే ఉద్యోగి జిల్లాలోని కళాకారులకు అందాల్సిన రూ.లక్షలు కాజేసిన ఘటనపై విచారణ ప్రారంభమైంది. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు కళాకారులు గతంలో ఇచ్చిన ఫిర్యాదుతో సదరు ఉద్యోగిని సస్పెండ్ చేసిన కలెక్టర్ ఘటనపై విచారణ అధికారిగా డీఆర్‌డీఓ శ్రీనివాస్‌కుమార్‌ను నియమించారు. విచారణలో భాగంగా ఆయన మంగళవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఓ కార్యాలయంలో కళాకారులు, పలు మహిళా సంఘాల ప్రతినిధులతో మాట్లాడి వివరాలు సేకరించారు. వివిధ దేవాలయాలు, ఇతర ప్రభుత్వ, ప్రైవేట్ కార్యక్రమాల్లో స్థానిక కళాకారులు, కళాజాతలతో కార్యాక్రమాలు నిర్వహించగా వారికి ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వకుండా డీపీఆర్వో కార్యాలయ ఉద్యోగి కాజేసినట్లు తేలింది. ప్రస్తుతం జరుగుతున్న విచారణలో సమారు రూ.50లక్షల వరకు ఈ విధంగా ఉద్యోగి మింగినట్లు అధికారులు గుర్తించారు. దీంతో వాటికి సంబంధించిన ఆధారాలు సేకరించే పనిలో అధికారులు ఉన్నట్లు సమాచారం.

టీజీయూజీఎస్ఈటీ ఎంట్రెన్స్‌కు దరఖాస్తులు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తదితరులు

హన్మకొండ అర్బన్ : తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ గురుకులాల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే టీజీయూజీఎస్ఈటీ - 2023 ఎంట్రన్స్ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయ కార్యదర్శి ఎస్.విద్యారాణి తెలిపారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు చేతుల మీదుగా ఎంట్రన్స్ పరీక్ష ఫ్లెయిర్ ఆవిష్కరించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్థాపించిన డిగ్రీ కళాశాలలో ఎంతో మంది పేద విద్యార్థులు నాణ్యమైన విద్యను అభ్యసిస్తున్నారన్నారు. ఆర్‌సీఓ ఎస్.విద్యారాణి మాట్లాడుతూ ఇంటర్మీడియేట్ పూర్తి చేసిన అర్హులైన విద్యార్థినులు ఆన్‌లైన్‌లో http://tswreis.in, http://www.tgtwgurukulam.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీడబ్ల్యూ ప్రిన్సిపాళ్లు టి.భద్రకాళి, పి.వింధ్యారాణి, వైస్ ప్రిన్సిపాల్ టి.సాంబలక్ష్మి పాల్గొన్నారు.

ఎండు గంజాయి పట్టివేత


పట్టుబడిన గంజాయిని పరిశీలిస్తున్న పోలీసులు

మామునూరు: మామునూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీగా ఎండు గంజాయి పట్టుబడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఖమ్మం మీదుగా వరంగల్ నగరానికి వాహనంలో తరలిస్తున్న 28 ప్యాకెట్ల ఎండు గంజాయిని వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ సందర్భంగా పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను బుధవారం పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించనున్నట్లు తెలిసింది.

యాసిడ్ దాడి చేస్తే పదేళ్ల జైలు

- వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఉపేందర్‌రావు



సదస్సులో మాట్లాడుతున్న ఉపేందర్‌రావు

వరంగల్ చౌరస్తా: మహిళలపై యాసిడ్ దాడి పెద్ద నేరమని.. యాసిడ్ దాడి చేసిన నిందితులకు కనీసం పదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించడం జరుగుతుందని వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జె.ఉపేందర్‌రావు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యాచరణలో భాగంగా వరంగల్ కృష్ణకాలనీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యాసిడ్ దాడి – న్యాయ సాయం అనే అంశంపై మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై యాసిడ్, పెట్రోల్ దాడులు అత్యంత కిరాతకం, క్రూరమైన నేరాలన్నారు. ఈ మేరకు విద్యార్థినులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. యాసిడ్ దాడి బాధితులకు వైద్యం కోసం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రూ.3 లక్షల నుంచి రూ.8లక్షల వరకు పరిహారం కింద అందజేయడం జరుగుతుందని చెప్పారు. బాధితులకు న్యాయ సేవా సంస్థలను ఆశ్రయించి న్యాయం పొందవచ్చుని పేర్కొన్నారు. అనంతనం న్యాయ సేవాధికార సంస్థల విధి, విధానాలు, ఉచిత న్యాయ సాయం, చట్టాలపై కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.విజయాదేవి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


సద్గురు త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు




జ్యోతిప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభిస్తున్న భద్రకాళి శేషు, సంగీత కచేరి

హన్మకొండ కల్చరల్ : రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో హనుమకొండలోని విద్యారణ్య ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యంలో సద్గురు శ్రీత్యాగరాజస్వామి 176వ ఆరాధనోత్సవాలు, భారతీయ సంగీత శాస్త్రవేత్త పండిట్ శ్రీవిష్ణు నారాయణ్ భాత్‌ఖండే, హిందూస్థానీ సంగీత విద్యాంసుడు పండిట్ శ్రీవిష్ణుదిగంబర్ పలూస్కర్ జయంతోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. వరంగల్ పోతన విజ్ఞాన పీఠంలో ప్రిన్సిపాల్ ఎస్.సుధీర్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భద్రకాళి దేవాలయం ప్రధానార్చకుడు భద్రకాళి శేషు ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగీత, నృత్య విద్యను నేర్చుకోవడం వల్ల శారీరక, మానసిక ఒత్తిడిని జయించవచ్చని అన్నారు. ప్రముఖ కర్ణాటక గాత్ర సంగీత విద్వాంసుడు వాసా గోపినాథ్ ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపకులు, కళాకారులు త్యాగరాజస్వామి పంచరత్న కీర్తనల గోష్టి గానం నిర్వహించారు. అనంతరం అతిథులు, కళాకారులకు సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఏఆర్ ఎస్సై మృతి


యాదవరెడ్డి (ఫైల్)

కాజీపేట: ములుగు జిల్లా కేంద్రంలో ఏఆర్ ఎస్సైగా పనిచేస్తున్న గంజి యాదవరెడ్డి(52) మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ములుగులో విధులు ముగించుకుని హనుమకొండ బస్టాండుకు చేరుకున్న ఆయన ద్విచక్రవాహనంపై రాంనగర్‌లోని ఇంటికి వెళ్తుండగా ఏషియన్ శ్రీదేవి మాల్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సుబేదారి పోలీసులు విచారణ జరుపుతున్నారు. మృతుడికి భార్య కృష్ణవేణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఐటీకోర్ సిబ్బందికి ప్రశంస పత్రాలు

కాజీపేట: విధి నిర్వాహణలో రాణించే సిబ్బందికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని సీపీ డాక్టర్ ఏవీ రంగనాథ్ అన్నారు. రాష్ట్ర స్థాయిలో ఐటీ అప్లికేషన్ల వినియోగంలో ప్రతిభ కనబర్చిన ఐటీ కోర్ సిబ్బందికి సీపీ కార్యాలయంలో మంగళవారం ప్రశంస పత్రాలు అందజేశారు. హెడ్ కానిస్టేబుల్ వి.మాధవరావు, ఎండి అన్వర్, పీసీలు పి.రాజేందర్, కె.శ్రావణ్‌కుమార్, ఎం.ప్రవీణ్‌కుమార్ ప్రశంస పత్రాలు అందుకున్న వారిలో ఉన్నారు.

బీజేపీ లోక్‌సభ నియోజకవర్గ కన్వీనర్ల నియామకం

హన్మకొండ: బీజేపీ లోక్‌సభ నియోజకవర్గాల కన్వీనర్లు, జాయింట్ కన్వీనర్లను నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ కన్వీనర్‌గా తాళ్లపల్లి కుమారస్వామి (హనుమకొండ), జాయింట్ కో కన్వీనర్లుగా అల్లం నాగరాజు, (వరంగల్), ఇ.యుగేందర్ రెడ్డి (జనగామ), చాడా రఘునాథరెడ్డి(భూపాలపల్లి)ని నియమించారు. మహబూబాబాద్ లోక్‌సభ కన్వీనర్‌గా ముసుకు శ్రీనివాస్‌రెడ్డి (కొత్తగూడెం), జాయింట్ కన్వీనర్లుగా సింగారపు సతీష్(మహబూబాబాద్), టి.దేవేందర్ రావు (ములుగు), జాటోత్ సంతోష్(వరంగల్)ను నియమించారు. అలాగే, భువనగిరి లోక్‌సభ కన్వీనర్‌గా బండారు లింగస్వామి(భువనగిరి), జాయింట్ కన్వీనర్లుగా కొంతం శ్రీనివాస్(జనగామ), నారాయణయాదవ్(రంగారెడ్డి రూరల్)ను నియమించారు. అదేవిధంగా లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ప్రభారీలను కూడా నియమించారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ ప్రభారీగా గొట్టల ఉమారాణి, మహబూబాబాద్ లోక్‌సభకు కట్ట సుధాకర్ రెడ్డి, భువనగిరి నియోజకవర్గ ప్రభారీగా చింతల రామచంద్రారెడ్డిని నియమించారు.

బయ్యారంలో చోరీ

- 12 తులాల బంగారం, 10 తులాల వెండి, రూ.50 వేల నగదు అపహరణ


బయ్యారం: వివరాలు సేకరిస్తున్న పోలీస్ సిబ్బంది

బయ్యారం: మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలో మంగళవారం పట్టపగలే చోరీ జరిగింది. వివరాలిలా ఉన్నాయి. బయ్యారంలోని కమ్మ కల్యాణ మండపం వీధిలో నివసించే జమునారాణి గార్ల మండలం ముల్కనూరు ప్రభుత్వ పాఠశాలలో రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తోంది. మంగళవారం ఇంటికి తాళం వేసి పాఠశాలకు వెళ్లింది. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులకొట్టి చోరీకి పాల్పడ్డారు. పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన జమునారాణి తలుపులు తీసి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి బీరువాలో చూసింది. అందులోని 12 తులాల బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి వస్తువులు, రూ.50 వేల నగదు కనిపించలేదు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

ఏసీరెడ్డినగర్‌లో..

ఖిలా వరంగల్: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. శివనగర్‌లోని ఏసీరెడ్డినగర్‌కు చెందిన గ్యారంపెల్లి అశోక్ కూరగాయల మార్కెట్‌లో హమాలీగా పని చేస్తున్నాడు. భార్య పుట్టింటికి వెళ్లగా అశోక్ ఆదివారం రాత్రి ఇంటికి తాళం వేసి మార్కెట్‌కు వెళ్లాడు. పని ముగించుకుని సోమవారం ఉదయం ఇంటికి వచ్చేసరికే ఇంటి తలుపు ధ్వంసం చేసి కనిపించింది. ఇంట్లోని బీరువా ధ్వంసం చేసి మూడు తులాల బంగారం, రూ.15వేల నగదు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. దీంతో మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు.